

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



### అమెరికా సావనీర్లూ - ప్రత్యేక సంచికలూ

18

**ఎందుకో తెలియదు కానీ ఈ మధ్య జోగారావో,** కస్తూరి శివరావో పాడిన "నేనేం చేస్తే అదే ఘనకార్యం" అనే చాలా, చాలా పాత పాట  గుర్తుకొస్తోంది.

"అవును మరి, నువ్వూ ఆ ఇక్ష్వాకులం నాటి వాడివేగా. అలాంటి పాట పాడుకోక "ఆరేసుకోబోయి పారేసుకుంటావా, లేక రింగా రింగా అంటూ రింగులు తిరగ్గలవా?" అంది క్వీన్ విక్టోరియా.

ఇంతకీ అసలు కారణం ఏమిటంటే...మా హ్యూస్టన్ మహానగరంలో పదహారు సంవత్సరాల తరువాత మళ్ళీ మరొక దేశవాళీ మరియు అంతర్జాతీయ స్థాయి తెలుగు మహాసభలు ఉత్తర అమెరికాలో ఇటీవలే వెలిసిన నాటా సంస్థ వారు నిర్వహిద్దామని తలపెట్టినప్పుడు నేను మహా ఆనందపడ్డాను. వెనువెంటనే ఆ మహాసభల సందర్భంగా ఒక సభావిశేష సంచిక-అనగా సావనీర్- వేస్తారు కదా అని నాటా అధికారులతో మాట్లాడి, నిర్ధారణ చేసుకుని, ఆ ప్రత్యేక సంచికకి నేను ప్రధాన సంపాదకుడిగా ఉండడానికి దరఖాస్తు చేసుకున్నాను. పాపం నా మాట కాదనలేకో, మంచో, చెడో నాకున్న అనుభవాన్ని వాడుకునే అవకాశం పోగొట్టుకోలేకనో, ఈ వెట్టి చాకిరీ చెయ్యడానికి ఎవడో ఒకడు దొరికాడు కదా అనే సంబడంతోనో నాటా వారు నా విన్నపాన్ని అంగీకరించారు. ఇందులో నా కీర్తి కాంక్ష చాలా ఉంది. ఎందుకంటే, ఇప్పటి దాకా అమెరికా తెలుగు వారి దేశవ్యాప్త సంస్థల చరిత్రలో తానా (మధుర వాణి-1989), ఆటా (మధుర వాణి-1996), నాట్స్ (సంబరాల సంచిక- 2011) వారి మహాసభల ప్రత్యేక సంచికలకి నేను ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించాను. "వెలగబెట్టాడు", తగలబెట్టాడు" లాంటి అభిప్రాయాలు కూడా కొంతమంది నా గాఢ మిత్రులూ-గూఢ శత్రువులూ నా సంపాదకత్వం మీద వెలిబుచ్చారు.  ఇప్పుడు నాటా వారి "నాటా మాట" ప్రత్యేక సంచికకి కూడా ప్రధాన సంపాదకుణ్ణి అయితే, ఇప్పటి దాకా ఉత్తర అమెరికాలో అన్ని జాతీయ సంస్థల ప్రత్యేక సంచికలకీ... ..సంపాదకుడిగా వ్యవహరించిన ఒకే ఒక మానవ మాత్రుడిగా నేను చరిత్రపుటల్లోకి ఎక్కుదామనే నా స్వార్థం. అటువంటి అవకాశం నాకు కలిగించిన నాటా అధికారులకి నా ధన్యవాదాలు. కనీసం నా గురించి అయినా ఈ నాటా ప్రత్యేక సంచిక కలకాలం దాచుకోండి అని అందరినీ సరదాగా బతిమాలుతున్నాను. సరిగ్గా ఇవే మాటలు ఆ సావనీర్ సంపాదకీయంలో వ్రాశాను కానీ....దాం దుంప తెగ "మనం ఏం చేస్తే అదే ఘనకార్యం" అనే ఫీలింగ్ మటుకు నా బుర్రలోంచి పోవడం లేదు. ఆ మాట చెప్పినందుకే మా క్వీన్ విక్టోరియా ఇక్ష్వాకులం డైలాగు.

నాకు తెలిసీ ఇప్పటి దాకా అమెరికాలో ఎక్కడ, ఎటువంటి తెలుగు సభలు జరిగినా, సావనీర్ అంటూ వేస్తే....ఆ సావనీర్

సంపాదకుడు ముందుగా ప్రకటించే విషయం. "ఈ ప్రత్యేక సంచిక చరిత్రలో కలకాలం నిలబడేలా తీర్చిదిద్దుతున్నాం. రంగు రంగుల బొమ్మలతో, ఉత్తమ సాహిత్యపు విలువలతో ఎంతో ఆకర్షణీయంగా ఉండి, మీ కాఫీ టేబుల్ లేదా టీ పాయ్ మీద సగర్వంగా పెట్టుకునే స్థాయిలో ఉంటుంది. అందుచేత మీ రచనలు పంపించండి, మీరు పంపినా, పంపకపోయినా లేకపోయినా మా స్నేహితుల రచనలు మేం వేసుకుంటాం."

గత ముప్ఫై ఏళ్ళలో నేను అమెరికాలో అనేక రాష్ట్రాలలో ఉన్న అనేక ప్రతీ నగరాలకి వెడుతూనే ఉన్నాను. ఎక్కడికి వెళ్ళినా నేను ముందు ఎవరూ చూడకుండా రహస్యంగా చూసేది ఆ ఇంట్లో కాఫీ టేబులే. నమ్మండి, నమ్మండి.....నాకు ఎవరింట్లోనూ ఆ కాఫీ టేబుల్ మీద ఇలాంటి సావనీర్ ఒక్కటంటే ఒక్కటి కనపడ లేదు...ఆ ఎడిటర్ల ఇంట్లో తప్ప. ఆ మాటకొస్తే చాలా మంది ఇళ్ళలో తెలుగు పుస్తకాలే కనపడవు.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. ఇప్పుడంటే వెబ్ పత్రికలూ, ముఖ్యంగా పెర్సనల్ బ్లాగులూ కోకొల్లలుగా వచ్చాయి కానీ, ఇది వరకు అమెరికా రచయితలందరికీ తమ రచనలు వేసుకోడానికి ఈ సావనీర్లే దిక్కు. వీటిల్లో నేను గమనించినది ఏమిటంటే...ఆ నాటి నుంచీ నేటి దాకా, ఈ ప్రత్యేక సంచికలు అచ్చు మన తెలుగు సినిమాల లాంటివే. కథ ఇంచుమించు ఒకటే....పాత్రధారులు మటుకు మారతారు. ఉదాహరణకి ఏ ప్రత్యేక సంచికలో చూసినా ముందు పదీ, పదిహేను పేజీలు "ప్రముఖుల" సందేశాలు ఉంటాయి. రెండు వందల పేజీలకి పైగా ఉండే మొత్తం సావనీర్‌లో ఎందుకూ పనికిరాని మోస్ట్ యూస్ లెస్ పేజీలు ఇవే! నాకు తెలియక అడుగుతానూ, ఎక్కడో అమెరికాలో సభలు జరుగుతుంటే తెలుగు రాని ఆంధ్రా గవర్నరూ, ముఖ్యమంత్రీ, స్థానిక నగర మేయరూ, అమెరికా సెనెటరు...మొదలైన వాళ్ళు ఇచ్చే సందేశం ఏమిటీ, నా తలకాయ కాకపోతే? ఒక అమెరికా సంచికలో అయితే ఆ సంఘం ప్రెసిడెంట్ గారి గ్రామ సర్పంచ్ మరియు స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం సెక్రటరీల సందేశాలు కూడా వేశారు. హతోస్మి.

ఈ సందేశాల తరవాత సుమారు వంద పేజీలు సూటూ, బూటూ వేసుకున్న కొందరు నిర్వాహకులూ, కేవలం ఈ ప్రత్యేక సంచికలో ఫొటో కోసమే పంచె, లాల్చీ కండువా వేసుకుని నెర్వస్‌గా నవ్వుతూ ఉండే మరి కొందరు మగ నిర్వాహకుల రంగు రంగుల ఫొటోలూ, తళ, తళ లాడే పట్టు చీరలూ, నగలతో మెరిసిపోయే ఆడ నిర్వాహకుల ఫొటోలూ, ఎవరు ఎంత డబ్బు విరాళం ఇచ్చారూ అనే వివరాలతో నిండి ఉంటాయి. ఇప్పటిదాకా నేను చూసిన ఏ సావనీర్‌లోనూ జీన్స్ వేసుకున్న ఆడ పిల్ల ఫొటో చూడలేదు. అమెరికాలో రోజు వారీ జీవితంలో జీన్స్ వేసుకోని ఆడపిల్లనీ నేను చూడ లేదు. ఏ సంచిక సంపాదకుడికైనా ఈ పేజీల కూర్పు అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే, పొరపాటున ఒక్క ఫొటో సరిగ్గా పడ లేదో....అయిందే అతని పని. ఉదాహరణకి నన్ను ఒకాయన పిలిచి "ఇప్పుడే మీరు రూపొందించిన సావనీర్ చూశాను. ఇలా చేస్తే ఎలాగా?"

"ఏమయింది సార్" అన్నాను.

"ఏమవడం ఏమిటీ? నా ఫొటో మరీ అంత నల్లగా పడిందేమిటీ?

"నేనేం చెయ్యను సార్? ఆ ఫొటో మీరు పంపినదేగా?"

"అయితే మటుకు, నా గెడ్డం మాసిపోయినట్టు పడితే ఎలా?"

"క్షమించండి..ఆ ఫొటో తీయించుకున్న రోజున మీరు గెడ్డం గీసుకున్నారా?" అని అడగగానే...ఆయన ఠపీమని ఫోన్ పెట్టేశాడు.

ఆ మరుక్షణంలో నాకు ఒక శ్రీశ్రీగారి జోక్ జ్ఞాపకం వచ్చింది. అదేమిటంటే...శ్రీశ్రీగారు ఇంకా మహాకవిగా గుర్తింపబడకపోయినా...మంచి కవిగా పేరు తెచ్చుకుంటున్న రోజుల్లో ఆయన చిన్ననాటి మిత్రుడు ఒకాయన మద్రాసులో ఒక ఫొటోగ్రఫీ షాప్ పెట్టాడు. "ఇదిగో, నువ్వు కవిత్వం రాస్తావుగా...నా షాప్‌కి అందరినీ ఆకట్టుకునేలా ఒక మాంచి కేప్షన్ రాసి పెట్టు" అని ఆ మిత్రుడు శ్రీశ్రీ గారిని అడిగాడు. "ఓ దానికేం ఉంది" అని శ్రీశ్రీ గారు "ఇక్కడ ఫొటోలు అందముగా తీయబడును" అని రాసిచ్చారు.

అది చూసి ఆ మిత్రుడు "ఇది అందరూ రాసే కేప్షన్‌గా..నీ గొప్పేం ఉంది. ఇంకా డిఫరెంట్ గా రాయ లేవా" అని కోప్పడ్డాడు. దానికి శ్రీశ్రీ గారు "ఇక్కడ ఫొటోలు అచ్చు మీ మొహం వలె తీయబడును" అని రాసిచ్చారు. అలాగే.....ఈ నిర్వాహకుడిగారి మొహం అలా ఉంటే, నేనేం చెయ్యను చెప్పండి?

నేను గమనించిన మరొక విషయం ఏమిటంటే....అమెరికాలో ఇప్పటిదాకా వచ్చిన కొన్ని వందల ప్రత్యేక సంచికలలో కేవలం బాపూగారూ, చంద్రగారి కార్టూన్‌లు పదే, పదే రిపీట్ అవుతాయి. కొత్త సరుకు చాలా తక్కువ. "భశుం" లాంటి కొన్ని బాపూ కార్టూన్‌లు ఇంచుమించు అన్ని సావనీర్‌లలోనూ కనపడతాయి. తెలుగు నాట మంచి కార్టూన్‌లో వేసే వాళ్ళ సంఖ్య ఒక చేతి వేళ్ళ మీదా, చెత్త కార్టూన్‌లు వేసే వాళ్ళ సంఖ్య రెండు చేతులూ, రెండు కాళ్ళ వేళ్ళ మీదా, ఇంకా కావాలంటే పక్కింటి పిన్ని గారి కాళ్ళూ, వేళ్ళూ కూడా అద్దెకు తీసుకుని లెక్కపెట్టవచును.

ఇంతకీ అసలు విషయానికి మళ్ళీ వస్తే....ఇది వరకు "ఈ పుస్తకాలన్నీ ఇలా పబ్లిగ్గా కనపడేటట్టు ఈ బల్ల మీద పెట్టొద్దని ఎన్ని సార్లు చెప్పాను" అని మా క్వీన్ విక్టోరియా నన్ను మా ఇంటికి క్లీనింగ్ చేసే మెక్సికన్ అమ్మాయి వచ్చినల్లా నేను తయారు చేసిన సావనీర్‌లు పట్టుకెళ్ళి గరాజ్‌లో చాలా సార్లు విసిరేసినపుడల్లా నేను మళ్ళీ ఏ అర్ధరాత్రో ఆవిడ చూడకుండా గరాజ్ నుంచి తెచ్చి, మళ్ళీ బల్ల మీద పెట్టేసేవాణ్ణి. ఒకసారి ఆవిడ రెచ్చిపోయి వాటిని గరాజ్ బదులు గార్బేజ్‌లోకే విసిరెయ్యడంతో నేను విపరీతంగా శోకించి, పరిశోధించి, ఆవిడతో ఒక ప్రపోజల్ పెట్టాను. దాని ప్రకారం ఆవిడ రోజూ కూచుని టీవీ లివింగ్ రూములో ఉన్న కాఫీ టేబుల్ మీద కేవలం గ్రాండ్ కేన్యన్ లేదా మహా అయితే తాజ్ మహల్ పుస్తకాలూ మరియు టీవీ, వీసీఆర్ రిమోట్స్ పెట్టడానికీ, ఆవిడ ఎప్పుడూ అడుగుపెట్టని "అతిథి గది" అనగా గెస్ట్ బెడ్ రూంలో ఉన్న కాఫీ టేబుల్ మీద ఈ చరిత్రాత్మకమైన సావనీర్‌లు ఉంచడానికీ ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇందులో నా లాజిక్ ఏమిటంటే.....మనింటికి వచ్చిన అతిథులకి చూపించుకోడానికీ, నా గొప్ప చెప్పుకోడానికీ ఆ గెస్ట్ రూమే సరి అయిన స్థలం. ఆ మాటకొస్తే ఫార్మల్ లివింగ్ గది....అంటే అమెరికా ఇళ్ళలో ముందు గుమ్మం తలుపు తీయగానే కుడి వేపో, ఎడం వేపో ఖరీదైన ఫర్నిచర్‌తో ఉండే గది అనమాట .ఆ గదిలో కూడా ఈ సావనీర్‌లు పెట్టుకో వచ్చు కానీ...ఆ గదిలో ఎప్పుడు, ఎవరూ కూచోడం నేను ఎప్పుడు చూడ లేదు. పైగా మా ఇంటికి వచ్చే తెలుగు అతిథులని సాధారణంగా తిన్నగా ఫేమిలీ లివింగ్ రూముకే తీసుకెళ్ళిపోతాను....ఎందుకంటే అక్కడ టీవీ ఉంటుంది కదా! నా డ్రామాలూ, మా పిల్లల డాన్సులూ చూపించడానికి ఫార్మల్ లివింగ్‌లో టీవీ ఉండదుగా అందుకూ!

అన్నట్టు, ఈ మహాసభలలో నాకు రెండు అవార్డులు వరిస్తున్నాయి...ఒకటేమో "For Excellence in Service to Community & Telugu Literature" అనే పేరుతో నాటా వారూ...మరొకటేమో "Distinguished Alumni Award for Service to Literature" అని ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం (Andhra University Alumni Assoication) వారు ఇచ్చే పురస్కారమూ.....ఇప్పుడు నా తక్షణ సమస్య ఏమిటంటే, ఈ రెండు పతకాలూ మా ఫేమిలీ రూంలో ఉన్న కాఫీ టేబుల్ మీద పెట్టుకోవాలా, లేక అతిథి గదిలో ఉంచాలా, అక్కడే దాచుకున్న మరొక వంద పతకాలతో పాటు ఇవి కూడా ఎవరూ ఎప్పుడు అడుగుపెట్టని ఫార్మల్ రూంలో పెట్టుకుని, అప్పుడప్పుడు నేనే వెళ్ళి చూసుకుని మురిసిపోవాలా? ఎందుకైనా మంచిది, అదేదో మా క్వీన్ విక్టోరియానే అడిగితే పోలా, అనుకుని ఆవిణ్ణే అడిగాను...

"ముందు ఇది చెప్పు...వాళ్ళూ ఇచ్చేది ఉట్టి చెక్క ముక్కలేనా? ఏమన్నా డాలర్ల పారితోషికం ఉందా?" అంది మా క్వీన్ విక్టోరియా. ఏం చెప్పను....ఎలా చెప్పను?

Post your comments